క్లుప్తంగా

14న క్రైస్తవ సమ్మేళనం

నందిగామ టౌన్(నందిగామ రూరల్): క్రైస్తవులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకునేలా ముందుకు సాగాలని నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని నూతన యెరూషలేము ప్రార్థనా మందిరంలో మంగళవారం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14న క్రైస్తవ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జాన్, జయరాజు, పెద్దిరాజు, జ్ఞానానందం, తదితరులు పాల్గొన్నారు.

రేపు మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ

నందిగామ టౌన్(నందిగామ రూరల్): ప్రభుత్వం గీతకులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు ఈ నెల 6న లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ సీఐ బంగార్రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి కలెక్టర్ పర్యవేక్షణలో విజయవాడలో లాటరీ ప్రక్రియ నిర్వహించటం జరుగుతుందన్నారు.

ప్లాస్టిక్ కవర్‌లను నియంత్రించండి

నందిగామ టౌన్(నందిగామ రూరల్): పట్టణంలో ప్లాస్టిక్ కవర్‌ల వినియోగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీధర్ మున్సిపల్ కమిషనర్ రమణబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీస్టాళ్లలో ప్లాస్టిక్ కవర్‌లలోనే పార్శిల్ చేస్తున్నారని కమిషనర్‌కు వివరించారు. ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కలిగించటంతో పాటు నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు ఇప్పటికే పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, టీస్టాల్స్‌లో కూడా వినియోగించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సూర్యఘర్‌పై ప్రజలకు అవగాహన



బూదవాడ(జగ్గయ్యపేట): పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనా పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. గ్రామంలో సూర్యఘర్ బిజిలీ పథకంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకునేందుకు కేంద్రప్రభుత్వం పథకాన్ని రూపొందించిందని తెలిపారు. సోలార్‌రూఫ్ టాప్ వల్ల విద్యుత్ బిల్లులు తగ్గించుకుని విద్యుత్‌ను విక్రయించుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే మండలంలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. చిల్లకల్లు, ధర్మవరప్పాడుతండా గ్రామాలలో లబ్దిదారులు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రంగారావు, ఏపీఎం వెంకటేశ్వరరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించండి

కంచికచర్ల: మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద జాతీయ భద్రతా వారోత్సవాల కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టోల్ ప్లాజా సీఓఎం రాజారావు మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతా నియమ నిబంధనలు పాటించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదన్నారు. మద్యం తాగి, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపొద్దన్నారు. ద్విచక్రవాహనం నడిపే వారంతా విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా అధికారులు బాలాజీ శర్మ, మేనేజర్ జయప్రకాష్, విజయ్‌దీపక్, జయశ్రీ, శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సైన్స్‌పై మక్కువ, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యార్థులు వివిధ అంశాల్లో వందకు పైగా ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో సైన్స్ ప్రయోగాలు చేసి ఆకట్టుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులను కరస్పాండెంట్ మురళీమోహన్ అభినందించారు.

ఆర్వో ప్లాంట్లకు కూటమి గ్రహణం

- అలంకార ప్రాయంగా ఆర్వో ప్లాంట్లు
- రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు నిర్మించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ప్రస్తుతం పట్టించుకునేవారు లేక మూలనపడిన వైనం
- మండలంలో 14 పాఠశాలల్లో పని చేయని ఆర్వో ప్లాంట్లు
- సురక్షిత నీటికి విద్యార్థులు దూరం



ముచ్చింతాల యూపీ స్కూల్‌లో మూలనపడిన ఆర్వోప్లాంటు

పెనుగంచిప్రోలు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు- నేడు అభివృద్ధి పనులతో పాఠశాలల రూపురేఖలు మార్చింది. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించింది. ఇందులో భాగంగానే విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది.

ఈ ప్రభుత్వంలో...

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్వోప్లాంట్లు మరమ్మతులకు నోచుకోక పోవటంతో మూలకు చేరాయి. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు చాలా పాఠశాలల్లో సురక్షిత జలం కరువైంది. చిన్నచిన్న మరమ్మతులు చేయకపోవటంతో చాలా ప్లాంట్లు పనిచేయటం లేదు.

14 పాఠశాలల్లో పనిచేయని ఆర్వోప్లాంట్లు..

మండలంలో మొత్తం 32 పాఠశాలలు ఉండగా వాటిలో 20 ప్రాథమిక పాఠశాలలు, 5 యూపీ, 7 జెడ్పీ హైస్కూల్స్ ఉన్నాయి. వీటిలో 14 పాఠశాలల్లో పలు కారణాలతో, మరమ్మతులకు గురై ఆర్వోప్లాంట్స్ పనిచేయటం లేదు. ముచ్చింతాల యూపీ స్కూల్‌లో వరదలకు ప్లాంట్ మొత్తం మునిగి మరమ్మతులకు గురై మూలన పడింది. అనిగండ్లపాడు ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పైపులు పగిలి పనిచేయటం లేదు. కొన్ని చోట్ల నిర్వహణలోపం, నిర్వహణకు నిధులు లేకపోవటంతో మూలన పడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పెనుగంచిప్రోలు జెడ్పీ (బాలికలు) హైస్కూల్‌తో పాటు తుఫాన్ కాలనీ, కేఏల్, ఒకటో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో.. ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో కూడా ఆర్వోప్లాంట్లు పని చేయటం లేదు. సుబ్బాయిగూడెం, అనిగండ్లపాడులోని 3 ప్రాథమిక పాఠశాలలు, వెల్దుర్తిపాడులో ప్రాథమిక పాఠశాల, ముచ్చింతాల, లింగగూడెం యూపీ పాఠశాలలు, కొల్లికూళ్ల జెడ్పీ హైస్కూల్‌లో తదితర పాఠశాలల్లో ఆర్వోప్లాంట్లు పని చేయటం లేదు.

గతంలో వెంటనే మరమ్మతులు..



అనిగండ్లపాడు ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులకు గురైన ఆర్వోప్లాంటు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పుడు పెనుగంచిప్రోలు మండలంలో నాడు- నేడు పథకంలో భాగంగా మొదటి ఫేజ్‌లో 16 పాఠశాలలు రూ.3.45 కోట్లుతో, రెండవ ఫేజ్‌లో 31 పాఠశాలలు రూ.11.41 కోట్లతో అభివృద్ధి చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆర్వోప్లాంట్ల నిర్వహణకు 'అమ్మ ఒడి' నిధుల నుంచి డబ్బులు చెల్లించి ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహించేవారు.

తక్షణం మరమ్మతులు చేయించాలి



తక్షణం అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేసింది. నేడు చాలా పాఠశాలల్లో అవి మరమ్మతులకు నోచుకోక మూలన పడటంతో విద్యార్థులకు సురక్షిత జలం దూరమైంది.

– పొన్నం కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పెనుగంచిప్రోలు మండలాధ్యక్షుడు

ఇంటి నుంచి తీసుకు వెళ్తున్నారు



ఆర్వో ప్లాంట్లు పనిచేయక పోవటంతో పిల్లలు బాటిళ్లలో ఇంటి నుంచి తాగునీరు తీసుకెళ్తున్నారు. గతంలో ఇంట్లో కూడా లేని విధంగా పాఠశాలల్లో సురక్షిత జలాన్ని పిల్లలకు అందించారు. ఆర్వో ప్లాంట్లకు తక్షణం మరమ్మతులు చేయిస్తే బాగుంటుంది.

– కోట కృష్ణ, విద్యార్థిని తాత, అనిగండ్లపాడు

మరమ్మతులు చేయిస్తాం

మండలంలో కొన్ని పాఠశాలల్లో ఆర్వోప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని సాంకేతిక కారణాల వలన తాత్కాలికంగా పని చేయటం లేదు. కొద్ది రోజుల్లో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం.

–డి రవీంద్ర, ఎంఈవో, పెనుగంచిప్రోలు

సజ్జలను కలిసిన తన్నీరు



వైఎస్సార్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జలను కలిసిన పేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు, పార్టీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, జగ్గయ్యపేట నాయకులు మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై, మిర్చి రైతులు పడుతున్న ఇబ్బందులను, పార్టీ సోషల్ మీడియా సైనికులపై అక్రమంగా పెడుతున్న కేసుల గురించి వివరించినట్లు తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. అనంతరం పార్టీ జగ్గయ్యపేట నాయకులతో సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను కలుపుకొని వెళ్లడమే తమ లక్ష్యం అని, పార్టీ బలోపేతానికి కృషిచేసిన ఎవరినీ పార్టీ మరచిపోదని అన్నారని తెలిపారు. పార్టీకి మరలా పూర్వవైభవం వచ్చేసిందని, పార్టీ అందరికీ అండగా ఉంటుందన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వారిలో పేట మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, నాయకులు కన్నమాల శామ్యూల్, షేక్ నాగుల్‌మీరా, అమ్మనబోయిన గోపి, నల్లబోతుల వెంకటేష్ ఉన్నారు.

ప్రమాదకరంగా రహదారి

చిన్న తిరునాళ్ల భక్తులకు తప్పని ఇబ్బందులు



గుంతలుపడి, కంకర తేలిన అనిగండ్లపాడు- పెనుగంచిప్రోలు రోడ్డు

పెనుగంచిప్రోలు: మండలంలోని అనిగండ్లపాడు నుంచి మండల కేంద్రం పెనుగంచిప్రోలుకు వచ్చే రహదారి సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదలకు కోతకు గురై గుంతల మయంగా మారింది. తాత్కాలికంగా మట్టిపోసి మరమ్మతులు చేసినా అది కూడా ప్రస్తుతం పోయి కంకర తేలటంతో పాటు గుంతలు ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు. మార్చి 14 నుంచి నుంచి 18 వరకు శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల ఉత్సవాలు జరగనున్నాయి. అనిగండ్లపాడు నుంచి పెనుగంచిప్రోలు ఆలయం వరకు అమ్మవారి పసుపు- కుంకుమ బండితో పాటు వందల సంఖ్యలో బండ్లు, ట్రాక్టర్లు ప్రభలతో వస్తాయి. ఈ క్రమంలో ప్రమాదకరంగా మారిన రహదారిని తక్షణం మరమ్మతులు చేయించి, తారురోడ్డు నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అనాసాగరం కాలనీ వాసులు

నందిగామ టౌన్(నందిగామ రూరల్): వీధిలైట్లు వెలగకపోవటంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నామని అనాసాగరం కాలనీ వాసులు పేర్కొంటున్నారు. కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ రమణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాలనీలో వీధిలైట్లు వెలగక పోవటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వీధుల వెంట పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి దర్శనమిస్తున్నాయని చెప్పారు. తాగునీటి సరఫరా గతానికి కన్నా బాగున్నప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవటం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి



బహుమతులు అందజేస్తున్న గడుపూడి శ్రీరామ్

నందిగామ టౌన్(నందిగామ రూరల్): విద్యా రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని శ్రీఅక్షర విద్యా సంస్థల చైర్మన్ గడుపూడి శ్రీరామ్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన వారికి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ్ఞ వికాసం వంటి పరీక్షలు నిర్వహించటం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని తెలిపారు. ఇప్పటి నుంచే ర్యాంకులు, గ్రేడ్‌లు, మార్కులు అని ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రజ్ఞ వికాసం పరీక్ష నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్, నాయకులు షేక్ జాహిదా, నరసింహ, అభిషేక్, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక ఫలసాయం



కంచికచర్ల: సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక ఫలసాయం పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి కే విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి, కీసర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ సమాచారం, ఆరోగ్యాన్ని ఏవిధంగా కాపాడతామో అదేవిధంగా పంటలను రక్షించుకోవాలని తెలియజేశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించటమే ధ్యేయంగా రైతులను ముందుకు నడిపించటమే పొలం పిలుస్తోంది కార్యక్రమం అన్నారు. అనంతరం క్షేత్ర దర్శనం చేశారు. మిర్చి, మొక్కజొన్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ సహాయకులు గోపీనాథ్, గౌతమ్, రైతులు పాల్గొన్నారు.

ప్రస్తుత ప్రదేశంలోనే ఆస్పత్రి నిర్మాణానికి అనుమతి

నందిగామ టౌన్(నందిగామ రూరల్): ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలోనే కొత్తగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి గత నెల 12న జీవో నంబరు 82 ద్వారా ప్రభుత్వం అనుమతులిచ్చిందని ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కేవీఎస్ సత్యనారాయణ ఒక ప్రకటనలో వివరించారు. 'వంద పడకల ఆస్పత్రి నిర్మాణం జరిగేనా?' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. నందిగామలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏప్రిల్ ఆరు, 2023న అప్పటి ప్రభుత్వం జీవో నంబరు 46 ద్వారా 50 పడకల హాస్పిటల్ నుంచి వంద పడకల ఏరియా ఆస్పత్రిగా మార్చినట్లు తెలిపారు. ఆ తరువాత అదే ఏడాది ఆగష్టు 21న కొత్త ఆస్పత్రి నిర్మాణానికి స్థల సేకరణ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. గతేడాది డిసెంబరు 6న హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహించి కొత్త వంద పడకల ఆస్పత్రి భవనాలను ప్రస్తుతమున్న ఆస్పత్రి ప్రదేశంలోనే నిర్మించాలని తీర్మానించి ప్రభుత్వానికి పంపగా ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని చెప్పారు.

చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం



అనిగండ్లపాడులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ చిల్లకల్లు ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీభార్గవి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలని ఐసీడీఎస్ చిల్లకల్లు ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీభార్గవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో 'హెల్దీ ఉమెన్.. హ్యాపీ ఉమెన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాలు అందరూ తినాలని, వాటిలో మంచి పోషకాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని, యోగా చేయటం ద్వారా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పెనుగంచిప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోషకాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం



నందిగామలో పోషకాహార ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ కరుణకుమారి

నందిగామ రూరల్: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవటం వల్ల బిడ్డలు పరిపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఏసీడీపీవో కృష్ణకుమారి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మండలంలోని మాగల్లు, లింగాలపాడు గ్రామాలతో పాటు నందిగామ సెక్టార్‌లలో మంగళవారం పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవటం వల్ల పోషకాహార లోపం, రక్తహీనతను నివారించవచ్చన్నారు. పౌష్టికాహారం పిల్లల ఎదుగులకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాభి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



సామగ్రి స్వీకరించిన విద్యార్థులతో అరుంధతీయ సేవా సమితి నాయకులు

కంచికచర్ల: పేద విద్యార్థులకు తమ సేవాసమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అరుంధతీయ సేవా సమితి కన్వీనర్ ముండ్లపాటి పోతరాజు అన్నారు. స్థానిక అరుంధతీ నగర్‌లో అరుంధతీయ సేవా సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు పెన్నులు, వాటర్ బాటిళ్లు, ప్యాడ్‌లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జగ్గయ్యపేట కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ కే రమేష్ మాట్లాడుతూ త్వరలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రభుత్వం నిర్వహిస్తుందని, ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలను బట్టీపట్టి చదవకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు వస్తాయన్నారు. అనంతరం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమితి నాయకులు వేల్పుల ప్రభాకర్, మాదుగుల వాసుబాబు, నెమలి వాసు, కొండూరు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

వీరులపాడు: రైతుల భూవివాదాల పరిష్కారానికే ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. మండలంలోని గోకరాజుపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ముందుగా రీసర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని రీ సర్వే నిర్వహిస్తుందన్నారు. రైతుల పొలం సరిహద్దు వివాదాలను పరిష్కరించేందుకు రీసర్వే దోహదపడుతుందని తెలిపారు. రీ సర్వే చేసే అధికారులకు రైతులు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని చెప్పారు. ప్రభుత్వాధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పని తీరుపై ఫిర్యాదులు అందితే విచారించి చర్యలు తీసుకొంటామన్నారు. తహసీల్దార్ హుస్సేన్, డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ సంధ్య, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సీఎస్ఐ మిషనరీ ఆస్పత్రి విభాగాల ప్రారంభం




పేటలో సీఎస్ఐ మిషనరీ ఆస్పత్రి విభాగాలను ప్రారంభిస్తున్న బిషప్ రెవ.జార్జి కార్నేలియస్



సీఎస్ఐ ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణం, పరిసర ప్రాంతాలకు సీఎస్ఐ(చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) సంస్థ మిషనరీ ఆస్పత్రి ద్వారా నిరుపేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తామని సీఎస్ఐ కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం పీఠాధిపతి (బిషప్) రైట్ రెవ డాక్టర్ టి.జార్జి కార్నేలియస్ అన్నారు. స్థానిక విజయవాడ రోడ్‌లోని వైఎస్ సర్కిల్ వద్ద ఉన్న సీఎస్ఐ కాంపౌండ్‌లో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ మిషనరీ హాస్పిటల్‌ను మంగళవారం చర్చి కౌన్సిల్ పరిధిలోని పలువురు పాస్టర్లు, సంఘ కాపరులతో కలిసి ఆయన ప్రారంభించారు. సీఎస్ఐ పరిచర్యలో భాగంగా నిరుపేదల కోసం ఆధునిక ఎక్విప్‌మెంట్స్, సాంకేతిక పరిజ్ఞానంతో జగ్గయ్యపేటలో మిషనరీ ఆస్పత్రిని నిర్మించుకోవడం హర్షదాయకమన్నారు. నిత్యం కొనసాగే ఈ ఆస్పత్రిలో జనరల్, చర్మ, గుండె, కంటి, మహిళల వ్యాధులకు నామమాత్రపు ఫీజుతో వైద్యసేవలు అందజేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆస్పత్రిలో పలు విభాగాలను ప్రారంభించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పట్టణం, పలు గ్రామాలకు చెందిన సంఘస్తులు, నిరుపేదలు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరం అయిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ కృష్ణా- గోదావరి డయోసిస్ కమిటీ కార్యదర్శి టి.రవికుమార్, ట్రెజరర్ అలెగ్జాండర్, ప్రాపర్టీ సెక్రటరీ సుధీర్‌దత్తు, పాస్టర్స్ బోర్డు సెక్రటరీ పి.రవికుమార్, డయోసిస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పి.కనకరాజు, ఎంపీ జోసఫ్, పేట సీఎస్ఐ టౌన్ చర్చి డీనరీ చైర్మన్ ఎస్.పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల నిరసన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని కొండపల్లి పీహెచ్‌సీ వద్ద పలువురు ఆశాలు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఆశావర్కర్లు మాట్లాడుతూ కొన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపినప్పటికి మిగిలిన డిమాండ్స్ అమలు నెరవేర్చలేదన్నారు. వీటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా గుర్తించాలన్నారు. ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, క్యాజువల్ లీవ్స్, మరణించిన వారికి మట్టి ఖర్చులు జీఓ రూపంలో విడుదల చేయాలని, సంక్షేమ పథకాలు, ఒంటరి మహిళ పింఛన్ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 6న విజయవాడలో జరిగే ధర్నా విజయవంతం చేయాలన్నారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి పీహెచ్‌సీల ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షులు సులోచన, లక్ష్మీ, రూరల్ అధ్యక్షులు ప్రశాంతి, మార్గరేట్, మీనా, సునీత, వనజ, రమాదేవి, ఆశాలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఏడీసీపీ జి.రామకృష్ణ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిమ్రా డెంటల్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం ద్వారా ఎదుటి వారికి కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. డ్రైవింగ్‌లో మెలకువలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించి, రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమావళిని ఉల్లంఘిస్తే నూతన చట్టం మేరకు జరిమానాలు విధిస్తామని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాహిత్య, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.